# కథాసుధ



## అయ్యో ఏప్రిల్ ఫస్టా!!!

-కందుకూరి వెంకట మహాలక్ష్మి

"పోస్ట్" అన్న కేకకి వెళ్ళి ఉత్తరాలని అందుకుంది భవానీ. ఆఉత్తరాల్లో ఒకటి లేతనీలం రంగు కవరు. అది తన కూతురి పేరన వచ్చింది. పైన 'లోకల్' అని రాసుంది. ఒక ప్రక్కన అరకు ముద్ర ఉంది. ఆ ఉత్తరం చాలా ఆశ్చర్యాన్నీ, ఆదుర్దానీ కలిగించడంతో మిగిలిన ఉత్తరాలని బల్ల మీద పెట్టి, కొశ్చెన్ మార్కు ముఖంతో ఆ కవర్ని చింపింది. అది ప్రేమలేఖ. తన కూతురు సౌదామినికి వ్రాసిన ప్రేమలేఖ. అందులో "సౌదామినీ నేను నిన్ను ఎంతగానో ప్రేమిస్తున్నాను. నీ అందానికి దాసుడనవ్వాలని ఉంది. ఆదివారం సాయింకాలం నాలుగు గంటలకి గాంధీ పార్కులో కలుసుకుని మనసారా, మనసులు విప్పుకుని కబుర్లు చెప్పుకుందాం. తప్పకుండా వస్తావు కదూ? నీ కోసం వెయ్యి కళ్ళతో ఎదురుచూసే నీ ప్రియాతి ప్రియుడు ప్రమోద్.

ప్రేమతో నీ కోసం తపించే
నీ ప్రమోద్"

ఉత్తరం చదివిన భవానీ కాళ్ళూ చేతులూ వణకసాగాయి. 'నాకూతురి పేరున ప్రేమలేఖా? అదీ పార్కుకి రమ్మనా? ఎంత ధైర్యం? అయినా వీడూ, నాకూతురూ ఒకొర్నొకరూ ఎలా ఎరుగుదురు? వీడినెక్కడ నా కూతురు కలిసింది? ఈ రోజుల్లో పిల్లలు ఈ సినిమాలూ, టీ.వీలు చూసి పాడయిపోతున్నారు. ఏం చెయ్యాలిప్పుడు? పన్నెండేళ్ళ సౌదామినికి అప్పుడే ప్రేమ కలాపాలా? పిల్లలెలా తయారవుతున్నారు? కూతురు రాగానే అడిగితేనో! ఎలా అడగాలి?" అని అనుకుంటూ ,భర్తని రానీ అతనొస్తేగానీ నా ఆలోచనలు ఓ కొలిక్కి రావు, అనుకుని మనసుని బిగపెట్టుకుని భర్త రాక కోసం ఎదురు చూడాసాగింది.

శ్యామల రావు భార్య ఇచ్చిన ఉత్తరాన్ని చదివి కొద్ది క్షణాలు మాటరాక స్థాణువులా నిలబడిపోయాడు. భార్యా, భర్తలు ఏవో గుసగుసలాడుకున్నారు. ఆ ఉత్తరాన్ని జాగ్రత్తగా మడిచి జేబులో పెట్టాడు శ్యామలరావు. ఆదివారం రానే వచ్చింది. శ్యామలరావు గాంధీపార్కుకి కాస్త ముందే వెళ్ళి చెట్లు చాటునుంచి చూసీ చూడనట్లు ప్రమోద్ సౌదామినిని కలవమన్న జాగాకేసి చూడసాగాడు. అతను రాసిన టైముకి రానే వచ్చాడు, వచ్చి తను రాసిన బెంచీ మీద కూర్చుని ఎదురుచూడసాగాడు. ఓ పదినిమషాలయ్యాక అటూ, ఇటూ చూడటం, చేతివాచీ చూడటం చేస్తూ రెస్టులెస్‌గా ఉన్న ప్రమోద్‌ని ఓ ఇద్దరు కానిస్టేబుల్స్ వచ్చి

చెరో జబ్బా పట్టుకున్నారు. ప్రమోద్ తెల్లబోయి, కంగారు పడుతూ " నన్నెందుకు పట్టుకున్నారు?" అని అడగ్గానే "పిచ్చి పిచ్చి వేషాలెయ్యకు, ఎక్కు జీపు" అంటూ అతన్నీ, శ్యామలరావునీ జీపెక్కించుకుని
పోలీస్ స్టేషన్‌కి తీసుకెళ్ళి "ఎంతధైర్యం? పన్నెండేళ్ళ పిల్లకి ప్రేమలేఖ రాస్తావట్రా? పైగా "ఈరోజు పార్కుల్లో కలుద్దాం రమ్మంటావుట్రా" అంటూ లాఠీ ఎత్తగానే "ఆగండి బాబూ! నేను ముందు రాయలేదు ఆ అమ్మాయి వ్రాసిన ఉత్తరానికి జవాబు రాసాను. నేనేం ముందు రాయలేదు". అంటూ జేబులో ఉన్న ఉత్తరాన్ని తీసిచ్చాడు. ప్రమోద్.

అది చదివి తెల్లబోయిన కానిస్టేబుల్స్, ఆ ఉత్తరం తీసుకుని శ్యామలరావుని పిలిచి ఇచ్చి "ముందు మీ అమ్మాయికి బుద్ధి చెప్పుకొండ"ంటూ అతని చేత రిజిస్టరులో సంతకం చేయించుకుని వదిలేసారు ప్రమోద్‌ని. ఆ ఉత్తరం లో వ్రాత చూసి షాకయి ఏం మాట్లాడలేక తలవంచుకుని సారీ చెప్పి బైటికొచ్చేసాడు శ్యామలరావు. ఇంటికొచ్చిన శ్యామలరావు "భవానీ!" అంటూ పెట్టిన గర్జనలాంటి కేకకి అదిరిపడిన భవానీ "ఏమయిందండీ" అంటూ వచ్చింది పరుగులాంటి నడకతో. చేతిలో ఉన్న ఉత్తరాన్ని తీసి భవానీ ముఖాన కొట్టి "ఇదిగో చూడు ఇది ఎవరు రాశారో! దానికే ఆ వెధవ జవాబురాశాడు. తప్పు మనలో పెట్టుకుని ఎదుటి వాళ్ళని నిందించడం ఎందుకు? పోలీసు స్టేషన్ లో నేనెంత అవమానానికి ఎదురయ్యానో తెలుసా? " అంటూ అరుస్తున్న భర్తకి ఏం చెప్పాలో తెలీక గుడ్లనీళ్ళు కుక్కుకోసాగింది. ఆ ఉత్తరాన్ని పదే పదే చదివింది. ఆ ఉత్తరంలో వ్రాత తన చేతి వ్రాతే! తనెప్పుడీ ప్రేమలేఖ వ్రాసింది! ఎవడీ ప్రమోద్? తను స్కూల్, కాలేజీల్లో చదువుకునే రోజుల్లో కూడా ప్రమోద్ అన్న పేరున్న అబ్బాయి నెవ్వర్నీ ఎరగదే! ఇందులో తన చేతివ్రాత పైగా వెనక తన ఇంటి అడ్రస్.. ఏమిటిది? అని తల బద్ధలు కొట్టుకోసాగింది.

ఆనాటి నుండీ భర్త తనతో ముభావంగా ఉండటం చాలా బాధగా ఉంది. మాట్లాడినా వెటకారంగా "నీ ప్రియుడేమంటున్నాడు? ఇవాళ ప్రమోద్‌ని కలిసావా? మీ ప్రోగ్రామేమిటీ" లాంటి మాటలతో ఒళ్ళు తూట్లు పొడుస్తున్నాడు. నిజానికి తనే పాపం ఎరగదు. ఆ ఉత్తరం తనెప్పుడు, ఎందుకు రాసిందో కూడా బుర్ర బద్దలు కొట్టుకున్నా అర్ధం కావటంలేదు. ఇలా భర్త మనసులో పడ్డ అనుమానపు బీజం రోజు రోజుకీ మొక్కయి పెరుగుతుందే తప్ప తగ్గటం లేదు. ఇది ఇలా కొనసాగితే తన సంసారం ఏమవుతుంది? విడాకుల దాకా వెళ్తే? ఇలా ఆలోచిస్తూ తలంతా బరువెక్కసాగింది. భర్తకెంత చెప్పబోయినా వినిపించు కోవటం లేదు. తన చేతివ్రాత, వెనక తన ఇంటి అడ్రస్తో ఉన్న ఉత్తరం. కానీ తన పేరుకు బదులు సంతకం తన కూతురి పేరుని ఉంది. ఆ ఉత్తరం ఎదురుగా ఉంటే, తనెంత చెప్పినా అబద్ధమే కదా! కానీ తనా ఉత్తరం రాయలేదు. అది ఎలా ఋజువు చెయ్యాలి? పచ్చని సంసారంలో ఏమిటీ చిచ్చు? భగవంతుడా! ఇదెలా సర్దుకుంటుంది? ఏం చెయ్యాలి ఇప్పుడు.. అన్న ఆలోచనలతో, ఆవేదనతో సతమయిపోతోంది భవానీ.

ఈ సంఘటన జరిగి నాలుగురోజులే అయినా నాలుగు యుగాలుగా నరకం అనుభవిస్తున్నట్లుంది. తన జీవితంలో ఈ అపశృతి ఎలా తొలగుతుందిరా దేముడా! అంటూ ఆలోచించసాగింది భవానీ. ఏదో ఆలోచన

వచ్చి మర్నాడు భర్త ఆఫీసుకు వెళ్ళగానే తనూ బయలుదేరి తిన్నగా పోలీసు స్టేషన్ కి వెళ్ళి అక్కడి ఎస్.ఐ ని కలసి ప్రమోద్‌ని స్టేషన్‌కి తీసుకెళ్ళిన తారీకు చెప్పి, అతని అడ్రస్ అడిగింది. ఎస్.ఐ రిజిస్టర్ వెతికి ప్రమోద్ అడ్రస్ తీసి ఇచ్చాడు. ప్రమోద్ అడ్రస్ తీసుకుని సాయింత్రం అతని ఇల్లు వెతుక్కుంటూ వెళ్ళింది. భవానీ తలుపు తట్టగానేతట్టగానే తలుపుతీసినతన్ని "ప్రమోద్  గారీ ఇంట్లోనే ఉంటున్నారా?" అని అడగ్గానే "నేనేనండీ ఏం కావాలీ?" అని అడిగాడు. ప్రమోద్ బ్రహ్మచారి కావడంతో, అతనితో మరో ఇద్దరు బ్రహ్మచారులా ఇంట్లో కలిసి ఉంటున్నారు. "నేనేనండీ ప్రమోద్‌ని" అన్న ప్రమోద్ మీద విరుచుకు పడింది భవానీ "ఒరేయ్ రాస్కెల్! నేను నీకెప్పుడీ ప్రేమలేఖ రాసానురా. ఈ ఉత్తరం వల్ల నా సంసారం నాశనమవుతుందిరా! బంగారంలాంటి నా కాపరాన్ని విడాకులదాకా తీసుకొచ్చావు కదరా" అంటూ ఎగురుతున్న భవానీని చూసి గదిలో నిలబడ్డ అతని రూమ్మేట్లు "ఏమయింది మేడమ్!" అంటూ అడిగినదానికి భవానీ జరిగినదంతా చెప్పి, తన భర్త ప్రవర్తన గురించి చెప్పి కళ్ళ నీళ్ళు పెట్టుకొనసాగింది.

కథంతా విన్న రూం మేట్లు "సారీ మేడమ్! ఇది ప్రమోద్ తప్పుకాదు విషయం ఇంత విషమిస్తుందని తెలీక మేమే తమాషాగా వాడిని ఏడిపిద్దామని జోక్ చేసాము. కూర్చోండి మేడం అసలు విషయం చెప్తాము. మేమిద్దరము పేపర్ మిల్లులో పని చేస్తున్నాము. ప్రింటర్స్, ప్రెస్ వాళ్ళు మాకు చిత్తుకాగితాలు పంపించేస్తూ ఉంటారు. ఆ వచ్చిన కాగితాల్లో ఈ ఉత్తరం కనపడింది. ఆ ఉత్తరంలో పైన పేరు లేకుండా ' ప్రియా ' అంటూ ప్రారంభించారు. ఆ ఉత్తరాన్నే కవర్లో పెట్టి వీడి అడ్రస్ వ్రాయించి పోస్ట్ చేసాం. ఆ రోజు ఏప్రిల్ ఫస్టు వాడిని ఫూల్ చేద్దామని, వాడికా ఉత్తరం ఆ రోజు అందేలా పోస్టు చేసాం. మా వాడు కాస్త అమ్మాయిల పిచ్చగాడు. ఆ ఉత్తరం చదివి వెంటనే వాడు స్పందించి మీ అడ్రస్‌కి జవాబు రాసిఉంటాడు. తరువాత జరిగిన విషయం నేను చెప్పక్కర్లేదనుకుంటాను.," అంటూ ప్రమోద్ స్నేహితులు చెప్పిన విషయాలు విని, ఇటు భవానీ, అటు ప్రమోద్ ఆశ్చర్యపోయారు. అప్పుడు ప్రమోద్ స్నేహితులు "మేడమ్ మీరు కథలు రాస్తూంటారా? ఏ కథలోనైనా ప్రేమలేఖ లాంటిది రాసారా? గుర్తు తెచ్చుకోండి. ఆయా పత్రికలవాళ్ళూ బుట్టదాఖలా చేసిన చెత్తకాగితాలు మా పేపర్ మిల్లుకి వస్తూఉంటాయి, అందులో దొరికిన ఉత్తరమే అది సారీ మేడమ్! మీకు కలిగిన ఇబ్బందికి క్షమార్పణ చెప్పుకుంటున్నాం. మా వాడిని ఏప్రిల్ ఫూల్ చేద్దామని మేం చేసిన పని, ఓ సంసారాన్ని కూలదోసే స్థితికి వస్తుందనుకోలేదండీ! క్షమించండి మేడమ్!" అంటూ బ్రతిమాలుతున్న ఆ ఇద్దరి మీదా ఎగిరి పడుతున్న ప్రమోద్‌ని జాలిగా చూసింది భవానీ.

అప్పుడప్పుడు కథలు వ్రాసే అలవాటున్న భవానీ, కలం పేరుగా కూతురి పేరున కథలు వ్రాసి పత్రికలకి పంపిస్తుంది, ఒకటో రెండో కథలు ప్రింట్ అయ్యాయి. కానీ ఈ ప్రేమలేఖ ఏ కథలో వ్రాసి, ఏ పత్రికకి పంపిందో గుర్తురావటంలేదు. "ఎందులోనో రాసే ఉంటాను" అనుకుని, ప్రమోద్‌ని వారి స్నేహితులని చూస్తూ ఈ నిజాన్ని నా దగ్గర చెపితే చాలదు నా భర్త దగ్గర చెప్పండి" అంటూ వారిని తీసుకుని ఇంటికి వచ్చింది.

అప్పటికే ఇంటికొచ్చిన శ్యామలరావు "భవానీ ఎక్కడికి వెళ్ళింది? మళ్ళీ ప్రమోద్ గాడిని కలవడానికి వెళ్ళిఉంటుంది. కథ ముదురుతుంది. ఈ రోజు తాడో, పేడో తేల్చేసుకోవాలి" అనుకుంటూ భవానీ రాకకి ఎదురుచూడసాగాడు. ఇంతలో భవానీ, ప్రమోద్, మిగతా ఇద్దరూ కలిసి రావడం చూసి ఉగ్రరూపుడై ఎగరసాగాడు. అతన్ని శాంతింపచేసి, ప్రమోద్ మిత్రులు చెప్పిన కథంతా విని తెల్లబోయిన శ్యామలరావు ఏమీ మాట్లాడలేక వారినే చూస్తూ కూర్చుండిపోయాడు. ఇంతలో లోపలికి వెళ్ళి అలమారు తెరిచి భవానీ తను రాసిన కథలు కాపీ చేసి పంపిన వాటి తాలూకు చిత్తు కాపీలు వెతికి అందులో ఓ కథలో ఈ ప్రేమలేఖ కూడా ఉండటంతో తీసుకొచ్చి భర్తకి చూపించింది. ఆ చిత్తు కాగితంలో ఉన్న ఉత్తరం ప్రమోద్ తనకిచ్చిన ఉత్తరం ఒకటే కావడంతో ప్రమోద్‌కీ, వారి స్నేహితులకీ సారీ చెప్పి పంపించాడు శ్యామలరావు.

గాలీ, వానా తరువాత ప్రశాంతతని భరించడం చాలా కష్టం. ఇప్పుడు తప్పు చెయ్యని భవానీ బిగదీసుకుని కూర్చుంటే, సారీ చెప్పి బ్రతిమాలడం శ్యామలరావు వంతైంది.



శతాధిక కథా రచయిత్రిగా పాఠకుల ప్రశంసలు అందుకున్న శ్రీమతి కందుకూరి వెంకట మహాలక్ష్మి గారు కవయిత్రిగా, సంగీత సరస్వతిగా, గాయనిగా, నాటికల రచయిత్రిగా, నటిగా, దర్శకురాలిగా, తొలి మహిళా మెజీషియన్‌గా దేశ విదేశాలలో ఖ్యాతినార్జించారు.
ప్రస్తుత నివాసం న్యూఢిల్లీ.
కందుకూరి వెంకట మహాలక్ష్మి, ఎ-36/ఇ, డి.డి.ఏ. ఫ్లాట్స్, మునిర్కా, కొత్తఢిల్లీ - 110 067